# కోరిక

గుడిపాటి వెంకటాచలంగారు బి, ఏ, యల్ టీ

“నేను కోరేది నీకు తెలియడం లేదు.”

„తెలుసు కాని ఆకోర్కెందుకో తెలియదు.”

„నాకు నీజీవనమంతా కావాలి”

„అడుగున మిగిలిన జీవన మాధుర్యపు నిగ్గునంతా, రత్నమయ పాత్రిలోపోసి, తాగమని అందియ్యలేదూ?”

„వెర్రి తీపికి నాతల తిరుగుతుంది. మృత్యువుకైనా జీవనమిచ్చే భయంకరమైన యీఅమృతము నాకొద్దు. చాలు. దాహమైనప్పుడల్లా తాగడానికి చల్లని నీళ్లుకావాలి.

„తప్పుదోవల దయచేశావు. గుడిశలో తెల్లార్లూ దీపం వెలగాలంటే ఈదిశనుంచి ఆదిశకు హిమశిఖరాలన్ని వెలిగిస్తూ పరుగెత్తి అరనిమిషంలో ఆరిపోయ్యే విద్యుల్లత దగ్గిరికా వొస్తావు?

„ప్రేమవిద్యుల్లతనే కంఠహారంగా వేసుకుంటుంది.

„నువ్వుకూడా మేఘరథమెక్కరాదూ?,,

„భయంకరమైన సంచలనంలో నాస్వర్గం లేదు.,,

„పాపం!,,

„నీకాంతి నాగృహాన్నలంకరించాలి. నాకాలానికి మెరుగుపెట్టాలి. నీచిరునవ్వు నాహృదయాకాశాన్ని వెన్నెలతోనింపాలి. నీప్రేమ దృష్టులు అర్థంలేని నాజీవితానికి రంగుతెప్పించాలి.,,

„పువ్వునించి పువ్వుకెగిరే తేనెటీగ, కమలమైనాసరే, దాంట్లో నివాసమేర్పరుచుకుంటుందా?,,

„కమలం వాంఛతో వాడిపోతే?,,

„పుష్పసృష్టి ఆగుతుందా?,,

"కమలమో?"

"కమలంలో నివసిస్తే రెక్కలెందుకు?"

"అందానికి."

"యౌవనాన్ని ప్రేమకమ్మేశాను. నిన్ను యేమిచ్చి కొనుక్కోను? మిగిలిన కొనవూపిరి తీసుకొని, నాలుగు భీషణ మోహప్రజ్వలితములైన నాలుగు నిమిషాలియ్య. మధుప మెగిరిపోతుంది. కమలం వాడిపోతుంది. సరి. ఆకాశ సంచారాని కలవాటుపడి, ప్రతి నిమిషమూ మోహ పారవశ్యాన్ననుభవించిన పక్షి, రాత్రి రెక్కలతో నీకు నిద్రపట్టేటట్టు విసరగలదా? వెర్రి ఆశ!

# అశ్రుతర్పణము

కాళూరి వేంకటరామారావు.

చల్లనిపిల్లగాలి సుమ సౌరభముల్ గొని తెచ్చి వీవ; యీ
మల్లెకుటీర మందెకద మానిని! నీభుజమూని ప్రేమసం
ధిల్లగముచ్చటల్ మురిసితిన్ వసుధన్యునిగా దలంచినా
నెల్లవిధంబులన్ మరల నింతటిలోనను వీడి తేచెలీ!

మనకుపశాఖలియ్యవి సుమాయని పాదులుకట్టి నీరమున్
దినమునుపోసి యిర్వురము తీపిని పెంచిన మల్లెతీవ లో
యనుపమగాత్రి! వీనిసొగ సారసి, ఛాయలవిశ్రమింపగా
జనుటకు నీవు లేమి నివి చచ్చిననుండిననొక్కటే కదా